

విద్యుత్ సమస్యలపై కంట్రోల్ రూమ్‌లు

ప్రజాశక్తి - కాకినాడ

తుపాను హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అవాంతరాలను తక్షణమే పరిష్కరించేందుకు విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్ సర్కిల్, రాజమహేంద్రవరం పర్యవేక్షక ఇంజనీర్ టివిఎస్ఎన్.మూర్తి సోమవారం ప్రకటనలో సూచించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని రాజమహేంద్రవరం సర్కిల్ 7382299960, 0883 2463354, రాజమహేంద్రవరం టౌన్ 9490610094, రాజమహేంద్రవరం రూరల్ 9490610003, కాకినాడ 9493178718, పెద్దాపురం 9059034479, జగ్గంపేట 9490610096, 08852-233575, రంపచోడవరం 9440812682, రామచంద్రాపురం 9493178821, 08857243082, అమలాపురం 9440812659 నెంబర్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఇవి 24 గంటలూ అందుబాటులో ఉంటాయన్నారు.

ముంచుకొస్తున్న మిచౌంగ్

- ఈదురుగాలులు..వర్షాలు
- అన్నదాతల్లో ఆందోళన
- ఉప్పాడ వద్ద పెరిగిన అలల ఉధృతి

జిల్లాలో సోమవారం తెల్లవారు జాము నుంచి ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది..చేతికందే పంట నేలనంటింది..కోతకొచ్చే చేలు నీట మునిగాయి.. వరి కంకులు నేలకొరిగి పట్టి కొట్టుకుపోయాయి.. బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో జిల్లాలో ఒక మోస్తరు వర్షాలు సంభవించాయి.. నేటి ఉదయం తీరం దాటి సమయంలో భారీ వర్షాలు కురిచే అవకాశాలు ఉన్నాయన్నా వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులను మరింతగా ఆందోళనకు గురిచేస్తున్నాయి.



ఉప్పాడ తీరంలో ముందుకు చొచ్చుకొస్తున్న సముద్రంతో శిథిలమైన గట్టు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, యంత్రాంగం

మిచౌంగ్ తుపాను ప్రభావంతో కాకినాడ జిల్లా తీర ప్రాంత ప్రజలు వణికిపోతున్నారు. కొన్ని చోట్ల సముద్రపు కెరటాలు మూడు మీటర్ల ఎత్తున లేచి పడడంతోపాటు సుమారు 10 మీటర్ల వరకూ ముందుకు రావడం ద్వారా తీర గ్రామాలపై ప్రభావం చూపుతోంది. దానికితోడు బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. దీంతో ఉప్పాడ వద్ద కెరటాలు ఉధృతి కొనసాగుతుంది. బీచ్ రోడ్డుపై అలల తాకిడి పెరిగింది. కాకినాడ-ఉప్పాడ రోడ్డు మార్గంలో రాకపోకలు నిలుపుదల చేశారు. తహశీల్దార్ ప్రసాద్, సిబ్బంది పర్యటించి మత్స్యకారులకు పలు సూచనలు చేశారు. పునరావాస కేంద్రాలను రావాలని కోరారు. సోమవారం తాడేపల్లి నుంచి సిఎం జగన్ తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ప్రతి మండలంలోనూ ప్రత్యేక అధికార బృందాలు నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నాయని కలెక్టర్ కృతికా శుక్లా సిఎంకు వివరించారు.

తుపాను నేపథ్యంలో మంగళవారం కూడా కొన్ని చోట్ల మోస్తారు గాను, కొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. బంగాళా ఖాతంలోని వాయుగుండం మంగళవారం నాటికి తీవ్ర వాయుగుండంగా మారి, రేపటికి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని తెలిపింది.

పలు రైళ్లు రద్దు

విజయవాడ మీదుగా నడిచే 142కు పైగా రైళ్లను రైల్వేశాఖ రద్దు చేసింది. ప్రయాణికుల కోసం కాకినాడ టౌన్ 0884-2374227, సామర్లకోట 0884-232 7010, రాజమహేంద్రవరం 0883-2420541 స్టేషన్లలో రైల్వేశాఖ హెల్ప్ లైన్ నెంబర్లను అందుబాటులోకి తెచ్చింది.

దిగాలుగా ధాన్యం రైతు

జిల్లాలో ఖరీఫ్ సంబంధించి 60 శాతం కోతలు పూర్తయ్యాయి. సగానికి పైగా ధాన్యం కళ్ళాల్లోనే ఉండిపోయింది. దాంతో పలువురు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు చోట్ల ధాన్యం తడిసిపోయింది. సామర్లకోట, కరప, పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి, తాళ్ళరేవు, జగ్గంపేట కిర్లంపూడి, పెద్దాపురం తదితర మండలాల్లో ధాన్యం కళ్ళల్లోనే ఉండిపోయింది. గత నాలుగు రోజులుగా రైతు భరోసా సిబ్బంది ధాన్యం కొనుగోలుకు రాకపోవడంతో పొలాల్లోనే రాశులుగా ఉంచేశారు. ఇప్పుడు ధాన్యాన్ని ఎలా రక్షించుకోవాలనే ఆందోళనతో అన్నదాతలు హైరానా పడుతున్నారు. అయితే కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని ముందు జాగ్రత్తగా తేమ శాతం నిబంధన సడలింపు ఇచ్చి కొనుగోలు చేస్తున్నట్లు కలక్టర్ తెలిపారు.

పునరావాస కేంద్రాలు ఏర్పాటు

మిచాంగ్ తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కాకినాడ నగరపాలక సంస్థ అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసింది. తుపాను తీవ్రత అధికంగా ఉండే ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలను సిద్ధం చేసింది. తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవలసిన చర్యలపై నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారులు, విద్యుత్, ఫిషరీస్, అగ్నిమాపక, రెవెన్యూశాఖాధికారులతో ఆయా అంశాలపై సమీక్షించి పలు సూచనలు ఇచ్చారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండేవిధంగా కార్పొరేషన్ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్‌ను కూడా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అవసరమైతే టోల్ ఫ్రీ నెంబర్ 1800 4255 990కు కాల్ చేయాలని కమిషనర్ సూచించారు.

కమిషనర్ పర్యటన

తుపాను హెచ్చరికల నేపథ్యంలో నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు సోమవారం నగరంలో విస్తృతంగా పర్యటించారు. చీడీలపొర, దుమ్ములపేట, ఎన్ఎఫ్‌సిఎల్, మహాలక్ష్మి నగర్, ప్రాంతాల్లోని అవుట్‌లెట్లను పరిశీలించారు. వర్షపు నీరు నిలిచిపోకుండా అవుట్‌లెట్లను క్లియర్ చేస్తున్న తీరును పర్యవేక్షించారు.

పోలీసు శాఖ అప్రమత్తం

తుపాన్ వలన కురిసే వర్షాలకు, గాలులకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ ఒక ప్రకటనలో ప్రజలకు సూచించారు. నిరంతరం పోలీసుల సహాయం, సేవలు అందించడానికి కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 9393933233, 9490618508 నెంబర్ల ద్వారా సమాచారం, సహకారం పొందవచ్చన్నారు. సముద్రంలో కెరటాలు ఉదతంగా వస్తున్నందున, ముందు జాగ్రత్త చర్యగా ప్రమాదాల నివారించడానికి కాకినాడ- ఉప్పాడ బీచ్ రోడ్ ను తాత్కాలికంగా మూసివేసామన్నారు.

నేడు అన్ని పాఠశాలలకు సెలవు

తుపాన్ ప్రభావ రీత్యా కాకినాడ జిల్లాలోని అన్ని యాజమాన్యంలలోని అన్ని పాఠశాలలకు మంగళవారం కూడా లోకల్ హాలీడే ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి నాగమణి తెలిపారు. నిబంధనలు మేరకు ప్రయివేటు విద్యాసంస్థలు ఆదేశాలను పాటించాలని, గుట్టుచప్పుడు కాకుండా తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సామర్లకోట రూరల్ మండల పరిధిలో 11.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. వరి కోతలు నిలిపివేసి తక్షణమే ధాన్యంను రైసు మిల్లులకు తరలించాలని అధికారులు ఆదేశించారు. ధాన్యం రాశులకు ప్లాస్టిక్ బరకాలను కప్పి రక్షణ చర్యలను రైతులు చేపట్టారు. ఆర్‌డిఒ కిషోర్ బృందం పలుచోట్ల పర్యటించి ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు రైసు మిల్లులకు తరలించారు. ఆఫ్ లైన్ విధానంలో మూడు రోజులుగా 1482 మెట్రిక్ టన్నుల ధాన్యంను కొనుగోలు చేశామని ఎఒ ఇమ్మిడిశెట్టి సత్య చెప్పారు. **పెద్దాపురం** మండల ఏలేరు పరివాహక గ్రామాల్లో సుమారు 5 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. 80 శాతం వరకు కోతలు పూర్తయ్యాయి. 50 శాతం నూర్పుళ్ళు జరగగా మరో 30 శాతం వరకు కళ్లాల్లో ధాన్యం ఉంది. రైతులు వరి కుప్పలపై, కళ్లాలపై టార్పాలిన్లు ఏర్పాటు చేశారు. తహశీల్దార్ జితేంద్ర, మండల వ్యవసాయ అధికారి సంజయ్ కుమార్, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది గ్రామాల్లో పర్యటించారు. **కరప** మండలంలోని అరట్లకట్ట, పెద్దాపురపాడు గ్రామాల్లో జెసి ఇలాక్కియ పర్యటించారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. వెంటనే ప్రయివేటు వాహనాల ద్వారా దగ్గర్లో ఉన్న నాలుగు రైస్ మిల్లుకు తరలించే ఏర్పాట్లు చేయాలని తహశీల్దార్ పి.శ్రీనివాసరావును ఆదేశించారు. కరపలో ఎఒఎన్.విజయ్ కుమార్ పరిశీలించారు. **యు. కొత్తపల్లి** తుఫాను ప్రభావంతో ఉప్పాడ సముద్ర తీరంలో రోడ్లను కలెక్టర్ కృతికా శుక్లా పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలన్నారు. ఆమె వెంట తహశీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు. **కోటనందూరులో** విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల ధాన్యం తడిసి ముద్దయిపోయాయి. తొండంగి మండలంలో బెండపూడి, ఎ. కొత్తపల్లి, శృంగరక్షం, ఎవి నగరం, కోటనందూరు మండలంలో కాకరాపల్లి, ఇందుకపల్లి గ్రామాల్లో 549 ఎకరాల్లో పంట తడిచింది. తుని వ్యవసాయ శాఖ ఎడి ఎస్.బుల్లిబాబు, కోటనందూరు వ్యవసాయ శాఖ ఎఒ కె.చంద్రశేఖర్, విస్తరణ అధికారి శివకుమారి పంటలను పరిశీలించారు. **తాళ్లరేవు** మండలంలోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షం కురిసింది. ఈదురుగాలులకు వరి పంట నేలకొరిగింది. పలుచోట్ల చెట్లు విరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగింది. గాడిమొగ ఫీడర్‌లోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ తీగలు తెగిపడడంతో విద్యుత్ శాఖ సిబ్బంది వాటిని పునరుద్ధరించే పనిని ప్రారంభించారు.



కోటనందూరులో తడిసిన వరి పనలను అధికారులను చూపుతున్న రైతు



సామర్లకోటలో పనలపై ఉన్న పంటచేలోకి చేరిన వర్షపునీరు



తాళ్లరేవులో రహమతుల్లాను సత్కరిస్తున్న నిర్వాహకులు

అలరించిన ఘంటసాల సంగీత విభావరి

ప్రజాశక్తి - కాకినాడ, తాళ్లరేవు

గానగంధర్వుడు ఘంటసాల 101వ జయంతి సందర్భంగా ఆది లీల ఫౌండేషన్, సరస్వతి గానసభల ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. ఈ సందర్భంగా ఘంటసాల గానఅవధానం ఆకట్టుకుంది. సోమవారం కాకినాడ సూర్య కళామందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో సినీ నటుడు డాక్టర్ జిత్ మోహన్ మిత్ర పాల్గొని ఘంటసాల పాట లను ఆలపించారు. ఘంటసాల అవగాహన సామ్రాట్ డాక్టర్ ఎస్ రహమ తుల్లా ప్రేక్షకుల సందేహాలను నివృత్తి చేశారు. ఆది లీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ, ఉపాధ్యక్షుడు టి.పార్థసారథి, సరస్వతి గానసభ ఉపాధ్యక్షులు రామకృష్ణ, సీతారామ రాజు కళావేదిక కార్యదర్శి పి.దయానంద బాబు, అధ్యక్షుడు కె.అచ్యుత రామిరెడ్డి, యు. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. తాళ్లరేవులో న్యూఢిల్లీ ఆదిలీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో పి. మల్లవరం డిజిబి కళ్యాణ మండపంలో సోమవారం ఎన్‌టిఆర్, ఎఎన్ ఆర్, మహానటి సావిత్రి కళావేదిక అధ్యక్షులు యు.వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో ఘంటసాల గానావదానం, సంగీత విభావరి నిర్వహించారు. ఘంటసాల అవధాన సామ్రాట్ డాక్టర్ రహమతుల్లా పలు ప్రశ్నలకు జవాబులు చెప్పారు. ఆదిలీల ఫౌండేషన్ ఛైర్మన్ ఎస్.ఆదినారాయణ, టి.పార్థసారథి పాల్గొన్నారు.

జీవన స్పర్శ నవల ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీగనారా రచించిన జీవనస్పర్శ నవల ఆవిష్కరణ సభ స్థానిక యుటిఎఫ్ హోమ్‌లో జరిగింది. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్. జోస్యుల కృష్ణబాబు సభకు అధ్యక్షత వహించారు. గదుల సాయిబాబా నవలను ఆవిష్కరించారు. ప్రముఖ కవి, సాహితీవేత్త అద్దేపల్లి ప్రభు నవలపై విశ్లేషణ చేశారు. ముఖ్య అతిథిగా మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ, సాహితీ స్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యరంజన్ పాల్గొన్నారు. సభాధ్యక్షులు డాక్టర్ కృష్ణబాబు మాట్లాడుతూ కాకినాడ, పెద్దాపురంలో సాహితీస్రవంతి ఆవిర్భావ వికాసాల్ని వివరించారు. 2016లో గనారా మొదటి నవల కడలి కల్లోలంను సిపిఎం నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ బహుమతి పొందిందని గుర్తు చేశారు. అదే నవలా ప్రక్రియను తీసుకుని గనారా జీవనస్పర్శ అనే మరో నవలను రాయటం అభినందనీయమని అన్నారు. అద్దేపల్లి ప్రభు నవలను విశ్లేషిస్తూ 'ఒక ట్రేడ్ యూనియనిస్ట్ వ్యక్తిగత సామాజిక వ్యక్తిగత సామాజిక ప్రేమగాథ ఈ నవల. ఆంతరంగిక మనస్తత్వాన్నీ దాని తటపటాయింపుల్నీ, తట్టుకోలేని తనాలూ దానివల్ల వచ్చే ఆగ్రహాలనీ చాలా బాధ్యతతో రాసిన నవల' అని అన్నారు. అనంతరం అవధానుల మణిబాబు, మార్ని జానకిరామ చౌదరి, కొత్తశివ, కట్టా కృష్ణారావు, సాలార్, బొల్లోజు బాబా తదితరులు మాట్లాడారు. అనంతరం అతిథులను, వక్తలను గనారా సత్కరించారు. కాకినాడ సాహితీస్రవంతి నగర అధ్యక్షులు మార్ని జానకిరామ చౌదరి అతిథుల్ని, వక్తల్ని వేదికపైకి ఆహ్వానించారు.



నవలను ఆవిష్కరిస్తున్న అతిథులు

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

ప్రజాశక్తి - కాజులూరు

తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల వల్ల తడిసిన ధాన్యంను సైతం కొనుగోలు చేయా లని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిం దని మంత్రి చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో రైతులకు చెందిన ధాన్యం రాశులు పోసిన ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అన్ని విధాల మేలు చేసే విధంగా చర్యలు చేపట్టిందని, రైతులు వద్ద ఉన్న ధాన్యం అంతా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకు న్నామన్నారు. అందుకు రైతులు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. వర్షం కొంచెం తెరిపిచ్చిన వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, సంచులు, కాటా, ట్రాక్టర్లు, లారీలు అన్ని సిద్ధంగా ఉన్నాయన్నారు. ఏ రైతు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. రైతులు ఎవరూ ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వం భావిస్తుందన్నారు. ఈ పర్యటనలో తహశీల్దార్ సాయి సత్యనారాయణ, వ్యవసాయ శాఖ అధికారి అశోక్, సర్పంచ్‌లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి వేణు



అర్జీలను స్వీకరిస్తున్న ఎస్‌పి సతీష్‌కుమార్

బాధితుల అర్జీలకు పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి - కాకినాడ

స్పందనకు వస్తున్న అర్జీలకు తక్షణమే చట్ట పరిధిలో పరిష్కరించాలని ఎస్‌పి ఎన్.సతీష్‌కుమార్ ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా బాధితుల నుంచి అర్జీలను ఆయన సోమవారం స్వీకరించారు. సివిల్ వివాదాలకు సంబంధించి 15, కుటుంబ తగాదాలకు సంబంధించి 12, ఇతర సమస్యలకు సంబంధించి 18 వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యా దులపై సమగ్ర విశ్లేషణ చేసి, సంబంధిత సర్కిల్, స్టేషన్ అధికారులు సత్వరం విచా రణ పూర్తి చేసి, పరిష్కారం చేయాలని ఆదే శాలు జారీ చేశారు. కాకినాడ రూరల్ సర్ప వరం గ్రామానికి చెందిన రాజేశ్వరి నగర్‌లో నివాసం ఉంటున్న పలివెల రత్నకుమారి ఇచ్చిన ఫిర్యాదులో యువివిజె. రాజు అనే వ్యక్తి నగదును అప్పుగా తీసుకున్నాడని, ఆ నగదును తిరిగి ఇవ్వాలని అడిగితే తనతో పాటు, తన కుమారుడిని చంపేస్తానని రౌడీలను తన ఇంటికి పంపించి భయ భ్రాంతులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేసింది. ఆమె వెంట తెలుగు జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వర రావు ఉన్నారు.

నిజమైన లబ్ధిదారులకే భూపట్టాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ల్యాండ్ సీలింగ్ భూములకు సంబంధించిన లబ్ధిదారులకే పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూరి ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు స్థానిక ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 30 ఏళ్ల క్రితం శాంతమూల, పటవల గ్రామాలకు చెందిన నిరుపేద ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఓసి సామాజికవర్గాలకు అప్పటి ప్రభుత్వం ల్యాండ్ సీలింగ్ భూములను సాగు చేసుకుని జీవనం సాగించేందుకు అవకాశం ఇచ్చిందన్నారు. ఆ భూములకు పట్టాలు ఇవ్వాలని అనేక దఫాలుగా అధికారులకు వినతిపత్రాలను అందించామని తెలిపారు. అయితే తమకు న్యాయం జరగలేదన్నారు. అయితే నాటి నుంచి నేటి వరకూ పన్నులు చెలిస్తున్నామని, అయితే తహశీల్దార్ మాత్రం తమ దగ్గర రికార్డులు లేవని భూములు ఇచ్చినప్పటినుండి పన్నులు చెల్లిస్తున్నామని, తహసిల్దార్ ను వారిని అడిగితే మా దగ్గర రికార్డు లేదని చెబుతున్నారన్నారు. అయితే ఈ భూముల లబ్ధిదారుల్లో కొంతమందికి గతంలో పనిచేసిన తహశీల్దార్లు పట్టాలు ఇచ్చారని ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎంఎల్ఎ మాట్లాడుతూ కలెక్టర్‌ను కలిసి ఈ విషయంపై చర్చించి పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పటవల పంచాయితీ సర్పంచ్ పినపోతు కామేశ్వరరావు, వైసిపి నాయకులు కొప్పిశెట్టి వెంకట్, కాలా వెంకటరమణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎంఎల్ఎకు వినతిపత్రం ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు




అర్జీలను స్వీకరిస్తున్న డిఆర్ఓ శ్రీధర్ రెడ్డి

సత్వరమే పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని డిఆర్ఓ కె.శ్రీధర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ స్పందన సమావేశ మందిరంలో జరిగిన జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో జడ్‌పి సిఇఒ ఎ.రమణారెడ్డి, డిఎల్‌డిఒ పి.నారాయణమూర్తిలతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను సత్వరం పరిష్కారించాలని ఆదేశాలు జారీ చేశారు. వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవ రత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం 129 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



డబుల్ ఇంజన్ అంటే.. ఒకటి మతం పేరుతో అధికారం రెండు ఉన్న వాళ్లను పడగొట్టి తెచ్చుకునే అధికారం..!!

ఎన్‌టిఆర్ ఆశయ సాధనలో భాగమే అన్న క్యాంటీన్

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

ఎన్‌టిఆర్ ఆశయ సాధనలో భాగంగానే టిడిపి ప్రభుత్వం అన్నా క్యాంటెన్‌లను ప్రారంభించిందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. మండల కేంద్రమైన జగ్గంపేట సెంటర్‌లోని ఎన్‌టిఆర్ స్మారక మందిరం కాంస్య విగ్రహం వద్ద గత 10 నెలలుగా ప్రతి సోమవారం సుదూర ప్రాంతాల నుంచి సంతకు వచ్చే పేదవారికి అన్నా క్యాంటెన్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సోమవారం కిర్లంపూడి మండలం శృంగరాయినిపాలెం గ్రామానికి చెందిన గొడే సావిత్రమ్మ జ్ఞాపకార్థం ఆమె భర్త కిర్లంపూడి మండల టిడిపి ప్రధాన కార్యదర్శి గొడే బాల ఆర్థిక సహాయంతో బోజనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ మాట్లాడుతూ పేదవాడికి తక్కువ ధరకే భోజనాన్ని అందించాలన్నా సంకల్పంతో టిడిపి ప్రభుత్వం అన్నా క్యాంటెన్‌లను ప్రారంభించిందని, అయితే వైసిపి ప్రభుత్వం పేదల కడుపును నింపే ఆ క్యాంటెన్‌లను మూసివేసిందని అన్నారు. ప్రభుత్వం యొక్క కళ్లు తెరిపించేందుకే జగ్గంపేటలో ప్రతీ సోమవారం అన్నా క్యాంటెన్ వద్ద భోజనాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, దాపర్తి సీతారామయ్య, ఎ.బాబి, మాజీ ఎంపిటిసి సభ్యులు బొజ్జపు నాగేశ్వరరావు, ఎ.వెంకన్న, వనపర్తి సత్యనారాయణ, వనపర్తి వీరభద్రరావు, తాసు నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.




భోజనం వడ్డిస్తున్న మాజీ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

క్యాంపెస్ సెలక్షన్స్‌లో ఒడిగోస విద్యార్థి

ప్రజాశక్తి - కాకినాడ

క్యాంపెస్ సెలక్షన్స్‌లో ఎంపికైన ఒడిగోస్ విద్యార్థి మార్టిన్ ఎంపిక కావడం అభినందనీయమని ఒడిగోస్ సిఇఒ వారా వినోద్ అన్నారు. స్థానిక రమణయ్య పేటలో 3వ ఎపిఎస్‌పి సమీపంలోని విజెఎస్ఎంఆర్ ఒడిగోస్ కార్యాలయంలో సోమవారం అభినందన కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వినోద్ మాట్లాడుతూ ఒడిగోస్ మొదటి బ్యాచ్ విద్యార్థి మార్టిన్ బ్రాండ్స్ పార్లోర్‌లో ఉద్యోగం సాధించారని అన్నారు. సివైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మూర్తి రాజు పాల్గొని మార్టిన్‌ను అభినందించిఉద్యోగ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగంతో బాధపడుతున్న ఉన్న యువత సమయాన్ని సద్వినియోగం చేసుకుని మంచి కోర్సుల్లో శిక్షణ తీసుకుని ఉద్యోగాలను సాధించాలని సూచించారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు విశేష సేవలు అందిస్తున్న ఒడిగోస్ సేవలను ఆయన కొనియాడారు. ఒడిగోస్ విద్యార్థి మార్టిన్ మాట్లాడుతూ ఒడిగోస్‌లో కోర్సును నేర్చుకోవడం వల్లనే ఉద్యోగాన్ని సాధించానని, అందుకు సహకరించిన వారికి వినోద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమములో ఒడిగోస్ అడ్వైజర్ మేరీ జ్యోతి, ఉష రాణి, చిన్న బాబు, బ్రాంచ్ మేనేజర్ శిరీష, ప్రియా, మౌలిక, వర్ష, విజయ్, నరేష్. సుభాష్, ప్రవీణ్, సందీప్, ఏసురత్నం, భాస్కర్ నాని, పాల్గొన్నారు.



ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకుంటున్న మార్టిన్

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనంతో వ్యక్తి మృతి చెందాడు. నిడదవోలు మండలం మునిపల్లికి చెందిన భావన రాము తణుకు నుంచి స్వగ్రామానికి బయలుదేరి వెళ్తుండగా ఉండ్రాజవరం వద్ద తణుకు వైపు వేగంగా వెళ్తున్న మరొక ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వైద్య సహాయం నిమిత్తం తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో రాము(55) మరణించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్ఐ కె.రామారావు తెలిపారు.

చిక్కాలలో ఎక్సైజ్ దాడులు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం చిక్కాలలో సెబ్ ఇన్‌స్పెక్టర్ విటివివి.సత్యనారాయణ ఆదేశాల మేరకు సోమవారం సిబ్బంది అక్రమ సారా, మద్యం విక్రయాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో చిక్కాల గ్రామానికి చెందిన పాతనేరస్తుడు కె.రాధాకృష్ణను అదుపులోనికి తీసుకొని చాగల్లు తహశీల్దార్ ఎదుట హాజరు పరచి బైండోవర్ చేశామని సిఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ జి.బసంతి, సిబ్బంది పాల్గొన్నారు

నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం



సోమవారం సీతానగరం మండలంలో ఎక్సైజ్ సిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది నాటు సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సింగవరం గ్రామానికి చెందిన మార్గాన్ని సూరిబాబు, వంగలపూడి గ్రామానికి చెందిన పెనుబోతు ఏడుకొండల వద్ద 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. కోర్టులో హాజరు పరుస్తామని సిఐ సత్యనారాయణ తెలిపారు.

17న వైసిపి బస్సు యాత్ర

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లిలో ఈ నెల 17న సామాజిక సాధికారత బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు తెలిపారు ఈ కార్యక్రమాన్ని దేవరపల్లిలో నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంలో జగనన్న పాలనలో ప్రజలకు జరిగిన మేలును, అభివృద్ధి పథకాలను పార్టీ నాయకులు వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరు కావాలని కోరారు



సముద్ర తీర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

సముద్ర తీరంలో కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

తుపాను నేపథ్యంలో సోమవారం కాకినాడ జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా రెవెన్యూ అధికారులతో కలిసి ఉప్పాడ సముద్రతీరాన్ని పరిశీలించారు. మండలం ఉప్పాడ గ్రామానికి సంబంధించి సూరాడపేట మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని, ఇతర ఏర్పాట్ల గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుపాను ప్రభావిత ప్రాంతాలైన ఉప్పాడ గ్రామానికి చెందిన సూరాడపేట, మాయాపట్నం, జగ్గరాజుపేట, బజారువీధి ప్రాంతాలకు చెందిన సుమారు 300 మందిని ఈ పునరావాస కేంద్రానికి తరలించినట్టు తెలిపారు. పునరావాస కేంద్రంలో ఉన్నవారందరికీ భోజనం, తాగునీరు, వైద్య శిబిరం, జనరేటర్ వంటి ఇతర సదుపాయాలు కల్పించినట్టు చెప్పారు. చిన్నారులకు పాలు, గుడ్లు అందించాలని, పునరావాస కేంద్రంలో ఉన్న వారి వివరాలన్ని సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పునరావాస కేంద్రంలో ఉన్నవారికి కలెక్టర్ భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు జివిస్.ప్రసాద్, ఉప్పాడ, అమీనాబాద్ గ్రామాల సర్పంచులు ఉమ్మిడి జాన్, మణికంఠ, ఇతర అధికారులతో పాల్గొన్నారు.

సామర్లకోటలో రైల్వే హెల్ప్ డెస్క్

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

తుపాను కారణంగా ప్రయాణికుల సేవల్లో భాగంగా సామర్లకోట రైల్వే స్టేషన్లో హెల్ప్ డెస్కును ఏర్పాటు చేసారు. ఒకటో నంబర్ ప్లాట్ ఫారంపై ఈ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి ఒకఅధికారిని నియమించారు. తుపాను కారణంగా దక్షిణమధ్య రైల్వేలో సుమారు 144 రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే స్టేషన్ మేనేజర్ రమేష్ చెప్పారు. సామర్లకోట నుంచి వివిధ ప్రాంతాలకు ప్రయాణించేందుకు ముందుగా రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు ప్రయాణ సదుపాయం, పలురైళ్ల సమాచారం అందించేందుకు ఈ హెల్ప్ డెస్క్ ద్వారా సేవలనందిస్తున్నట్టు చెప్పారు. ప్రయాణికులు రైళ్ల సమాచారం కోసం సామర్లకోట స్టేషన్‌కు 0884-2327010, రాజమండ్రి స్టేషన్‌కు 0883-2420541, తుని స్టేషన్‌కు 08854-252172 నంబర్ల ద్వారా సంప్రదించి వివరాలు పొందవచ్చన్నారు. 24 గంటల పాటు ఈ హెల్ప్ డెస్క్ సేవలు అందుబాటులో ఉంచుతున్నందున ప్రయాణికులు ఈ సేవలను వినియోగించు కావాలని స్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు.

చివరి ధాన్యం గింజ వరకూ కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - చాగల్లు



రోడ్లపై ధాన్యం రాశులను పరిశీలిస్తున్న జెసి

జిల్లాలో చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ అధికారులను ఆదేశించారు. ఆదివారం రాత్రి కొ చాగల్లు శివారు నందమూరి బ్రిడ్జి వద్ద నాలుగు ఎకరాల సంబంధించిన దాన్యం రాశిని రైసు మిల్లుకు తరలించాని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించా రు. వ్యవసాయ శాఖ అధికారి కె.గోపాలకృష్ణ మాట్లాడుతూ చాగల్లు మండలంలో 7,500 ఎకరాలకు 20 ఎకరాల్లో ధాన్యం మాత్రమే ఉందన్నారు. వంతెన వద్ద రైతు అనారోగ్యంతో ఉండడంతో నాలుగు ఎకరాల ధాన్యాన్ని మిల్లుకు తరలించలేదన్నారు. సిఎం ఆదేశాల మేరకు రైతులు ఎవరు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఆఫ్‌లైన్ కొనుగోళ్లను చేపట్టామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఎక్కడా ధాన్యం రాసులు లేకుండా మిల్లులకు తరలిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెసి తేజ్ భరత్, వ్యవసాయ శాఖ ఎడి పి.చంద్రశేఖర్, ఆర్‌డిఒ నాయక్, తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి, ఎంపిడిఒ బి.రాంప్రసాద్, రెవెన్యూ, వ్యవసాయ పాల్గొన్నారు.

కండక్టర్ ప్రసాదరావుకు డాక్టరేట్

ప్రజాశక్తి - గోపాలపురం



డాక్టరేట్‌ను అందుకుంటున్న కండక్టర్ ప్రసాదరావు

సాహిత్యం, చదరంగంలో విశేష కృషి చేస్తున్న వేలచింతలగూడేనికి చెందిన ఆర్‌టిసి కండక్టర్ కొలూరి ప్రసాదరావుకు గౌరవ డాక్టరేటు లభించింది. సోమవారం ఆయన మాట్లాడారు. చెన్నయ్ టి.నగర్ సోషల్ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ పీస్ సమ్మిట్ అధ్యక్షుడు హెచ్‌బి ప్రొఫెసర్, శాస్త్రవేత్త డాక్టర్ మధుకిషాన్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అందుకున్నానని తెలిపారు. అంతర్జాతీయ పీస్ ఐకాన్ అవార్డు కూడా అందుకున్నానని తెలిపారు. తాను ప్రస్తుతం జంగారెడ్డి గూడెం ఆర్‌టిసి డిపోలో కండక్టరుగా విధులు నిర్వర్తిస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. ఆయన గతంలో కవిమిత్ర, కథాభారతి, సాహితీ చదరంగ ప్రపూర్ణ, కళారత్న వంటి బిరుదులు కూడా అందుకున్నారు.

వీరభద్రరావుకు 'గురుతేజం' అవార్డు

ప్రజాశక్తి- కడియం



అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న నిర్వాహకులు

కడియం గ్రామానికి చెందిన ప్రభుత్వ గణిత ఉపాధ్యాయుడు ఉంగరాల వీరభద్రరావుకి గురుతేజం అవార్డు లభించింది. రాజమహేంద్రవరం పుష్కర్ వనంలో ఆదివారం జరిగిన కాట్వా ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులు భద్రరావుని ఘనంగా సత్కరించి ఈ పురస్కారాన్ని అందించారు. 26 ఏళ్లగా గణిత శాస్త్రాన్ని బోధిస్తూ ఎంతోమంది విద్యార్థులను ఆయన తీర్చిదిద్దారు. కాట్వా నేతలు బంగార్రాజు, కోలా సత్యనారాయణ, చలం, చోడిశెట్టి బాలాజీ తదితరులు చేతుల మీదుగా భద్రరావు అవార్డుని అందుకున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంఎల్ఎ కందుల దుర్గేష్, రాజానగరం ఎంఎల్ఎ జక్కంపూడి రాజా హాజరై భద్రరావును అభినందించారు. ఈ అవార్డు రావడం పట్ల కడియం ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు తదితరులు భద్రరావును అభినందించారు.

బాల కార్మికుల కోసం తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం



రఘుదేవపురంలో ఇటుక బట్టీలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

కలెక్టర్ ఆదేశాల మేరకు సీతానగరం మండలంలో పెట్రోల్ బంకులు, హోటళ్లు, సామిల్లు, దుకాణాలు, ఇటుక బట్టీల్లో కార్మిక శాఖ అధికారులు బాలకార్మికులను గుర్తించేందుకు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ కార్మిక అధికారి కార్తీక్ మాట్లాడుతూ దేశవ్యాప్త బాలకార్మికులు గుర్తింపులో భాగంగా సీతానగరంలో తనిఖీలు చేస్తున్నామని అన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే రూ.20 వేల నుంచి రూ.50 వేల జరిమానా, 6 నెలల నుంచి మూడేళ్ల జైలు శిక్ష వర్తిస్తుందని హెచ్చరించారు. బాలలను పనిలో పెట్టుకుని వెట్టిచాకిరీ చేయించకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారులు జబీనా, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

దుప్పిని స్వాధీనం చేసుకున్న అధికారులు

ప్రజాశక్తి - సీతానగరం



అధికారులు స్వాధీనం చేసుకుంటున్న దుప్పి

కుక్కల దాడిలో గాయపడిన దుప్పిని అటవీశాఖ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 1వ తేదీన అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం అటవీ ప్రాంతంలో ఒక వ్యక్తి మేకలు మేపుతూ సాయంత్రం ఇంటికి వస్తుండగా మేకలతో కలిసి ఒక దుప్పి వచ్చింది. దుప్పిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. మేకల కాపరి దుప్పిని ఇంటికి తీసుకుని వెళ్లి సంరక్షించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సోమవారం డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పద్మావతి ఆధ్వర్యంలో అచ్చియ్యపాలెంలో ఉన్న దుప్పిని స్వాధీనం చేసుకుని రాజమండ్రి ప్రధాన అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆవాస ప్రాంతానికి దుప్పిని తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డిఒ జివి.రంగారావు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా ఏడిద సావరం పుంత

ప్రజాశక్తి-మండపేట



మండలంలోని ఏడిద గ్రామ శివారు సావరం నుంచి మండపేట పట్టణానికి చేరుకునేందుకు ఎంతో సౌకర్యవంతంగా ఉండే సావరం పుంత రోడ్డు గత కొంతకాలంగా అధ్వానస్థితికి చేరుకుంది. దీంతో ఆ గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సావరం ప్రజలు మండపేటకు ఏడిద గ్రామం మీదుగా వెళుతున్నారు. ఈ పుంత రోడ్డు నేరుగా మండపేట బైపాస్ రోడ్డు మీదుగా సత్యశ్రీ రోడ్డుకు కలుస్తుంది. అక్కడి నుంచి రాజారత్న, కలువపువ్వు సెంటర్, తదితర ప్రాంతాలకు వెళ్ళవచ్చు. సుమారు నాలుగు కిలోమీటర్ల ఉన్న ఈ రోడ్డంతా గోతుల మయంగా మారడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఈ రోడ్డు అభివృద్ధి చేయడంలో భాగంగా రోడ్డును కొంతమేర తవ్వేశారు. ఎన్నికల అనంతరం తిరిగి పనులు ప్రారంభం కాలేదు. దీంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

స్పందనలో అర్జీలు స్వీకరించిన ఆర్‌డిఒ



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్‌డిఒ సీతారామారావు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆర్‌డిఒ సీతారామారావు అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పట్టణ పరిధిలో పరిశ్రమల కాలుష్యాన్ని అరికట్టాలని, పట్టాదారు పాసు పుస్తకం కోసం, ఆక్రమణల తొలగింపు కోసం, పట్టాదార్ పాస్ పుస్తకం కోసం తదితర దరఖాస్తులు అందయన్నారు. డివిజన్ స్థాయిలో అందిన ఈ అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపించి వెంటనే ఈ సమస్యలు పరిష్కరించేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఒ సరస్వతి, డిప్యూటీ తహశీల్దార్ భాను కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లింట విషాదం

గుండెపోటుతో పెళ్లి కొడుకు మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్



ప్రేమించిన అమ్మాయిని మరో రెండ్రోజుల్లో వివాహం చేసుకోబోతున్నాడు. ఈ మేరకు ఏర్పాట్లు కూడా చేసుకున్నాడు. ఉత్సాహంగా వెళ్లి పెళ్లి దుస్తులను సైతం కొనుగోలు చేసుకున్నాడు. అంతలోనే గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన జగ్గంపేట మండలం జి.మామిడాడలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పెళ్లింట విషాదం అలముకుంది. మండలంలోని మామిడాడ గ్రామానికి చెందిన వేగి ఏసురాజు(24) వాలంటీర్‌గా పని చేస్తున్నాడు. ప్రేమించిన అమ్మాయిని పెద్దల అంగీకారంతో మరో రెండు రోజుల్లో వివాహం చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో పెళ్లి సామగ్రి తీసుకుని ఇంటికి వచ్చాడు. సోమవారం అనారోగ్యానికి గురి కావడంతో స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపి వద్దకు వెళ్లి చూపించుకున్నాడు. ఇంటికి వచ్చిన అర గంటలో స్పృహ కోల్పోయాడు. వెంటనే స్థానికులు యువకుడిని ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. గుండెపోటుకు గురై మృతి చెందాడని తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలముకుంది.

వరి కళ్లాల పరిశీలన

ప్రజాశక్తి -గోకవరం

మండలంలోని పలు గ్రామాల్లో కళ్లాల్లో ధాన్యాన్ని సోమవారం మండల ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ జగదాంబ పరిశీలించారు. తుపాను ప్రభావం కారణంగా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఆరబెట్టిన ధాన్యమే కాకుండా పచ్చిధాన్యం, తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేసి మిల్లర్లకు పంపించాలని కలెక్టర్ ఆదేశించారన్నారు. తేమ ఉన్నా, లేకున్నా ప్రభుత్వం నిర్ణయించిన రేటుకే ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ఎవరకూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. ఆమె వెంట తహశీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎఒ రాజేశ్వరి, సిబ్బంది ఉన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తుపాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లా లోని విద్యా సంస్థలకు మంగళవారం స్థానిక సెలవు దినంగా ప్రకటించినట్టు డిఇఒ ఎస్.అబ్రహాం సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు నుంచి కాకినాడ జిల్లా వరకు ఎపిలోని తీర ప్రాంతాలకు ప్రత్యేకంగా తుపాను హెచ్చరికలను వాతావరణ శాఖ జారీ చేసిందని, దీంతో 5వ తేదీన స్థానిక సెలవు దినంగా ప్రకటించాలని కలెక్టర్ ఆదేశించినట్టు తెలిపారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కొత్తపేట

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి పలువురు సోమవారం ఆర్థిక సాయం అందించారు. బిళ్లకుర్రు శివారు మట్టపర్తి వారిపాలెంకు చెందిన మట్టపర్తి వెంకటేష్ కొద్ది రోజుల నుంచి కిడ్నీ సమస్యతో బాధ పడుతున్నాడు. అతడిని వైద్య చికిత్స కోసం హాస్పిటల్‌కు తీసుకెళ్లగా డాక్టర్లు రెండు కిడ్నీలూ పాడైపోయాయని తెలిపారు. దీంతో ఆయన తల్లి ఒక కిడ్నీ దానం చేయడానికి ముందుకొచ్చారు. కిడ్నీ మార్పిడికి సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు. విషయం తెలుసుకున్న శెట్టిబలిజ సంఘ సభ్యులు వారం క్రితం రూ.20 వేలు, బిళ్లకుర్రు మాసాయిపేట యువత ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఎవరైనా దాతలు ముందుకొచ్చి ఆ యువకుడికి వైద్యం కోసం ఆర్థిక సాయం అందించాలని కోరారు.

ఓటరు క్లైయిములను పరిష్కరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

బూత్ లెవెల్ ఆఫీసర్స్ ఓటర్ల నుంచి వచ్చే ఓటరు క్లైములను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని పరిష్కరించాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్‌డిఒ జె.సీతారామారావు ఆదేశించారు. సోమవారం పెద్దాపురంలో సామర్లకోట, పెద్దాపురం మున్సిపల్ పట్టణాలకు సంబంధించిన బిఎల్‌ఒలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫోటో సిమిలర్ ఎంట్రీస్, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీస్ ప్రాసెస్ చేసే విధి విధానాలను వివరించారు.

కిటకిట లాడిన భీమేశ్వరాయం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

తుపాను కారణంగా వర్షం పడుతున్నా సామర్లకోట భీమేశ్వరాలయం సోమవారం కిటకిటలాడింది. కార్తీక మాస పూజలు మూడో సోమవారం ఆలయంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము 4.30 గంటలకే స్వామి వారికి, అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలా త్రిపరసుందరీ అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఎలాంటి ఇబ్బందీ కలగకుండా దేవాదాయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు



నేలకొరిగిన విద్యుత్ స్తంభం

మండలం పోలేకుర్రు పంచాయతీ తూర్పుపేట, పి.మల్లవరం పంచాయతీ పత్తిగొందిలో ఆరు విద్యుత్ స్తంభాలు తుఫాను ప్రభావంతో నేలకొరిగాయి. దీంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తాళ్లరేవు విద్యుత్ శాఖ ఎఇ ఇసిహెచ్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ స్తంభాలను తొలగించి విద్యుత్తును పునరుద్ధరించారు.

యానాం వార్తలు

యానాంలో పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి - యానాం

మిచౌంగ్ తుపాన్ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ప్రాణనష్టం, ప్రమాదం కలగకుండా ఉండేందుకు సెక్షన్ 144 అమలు చేస్తున్నట్లు ఆర్ఎఒ మునిస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి, ఇళ్ల నుంచి, రక్షణ శిబిరాల నుంచి బయటకు రాకుండా ఉండాలన్నారు. తుపాను నెల్లూరు - మచిలీపట్నం మధ్య తీరం దాటనున్న నేపథ్యంలో యానాంలో కుండపోత వర్షాలు ప్రభావం ఉండడంతో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలకు మంగళవారం సెలవు ప్రకటిస్తూ పుదుచ్చేరి డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పి ప్రియదర్శిని సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు ప్రాంతీయ విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్ సెలవును ధ్రువీకరించారు.



బోజనం వడ్డిస్తున్న ఎంఎల్ఎ

పలు ప్రాంతాల్లో ఎంఎల్ఎ పర్యటన

ప్రజాశక్తి - యానాం

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆదివారం అర్ధరాత్రి నుంచి సావిత్రి నగర్, గిరియం పేట, పరం పేట గ్రామాల్లో పర్యటించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనులను పర్యవేక్షింఆరు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న కంట్రోల్ రూమ్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో ఉన్న స్కూల్స్‌లను పునరావాస కేంద్రాలుగా మార్చమన్నారు. మత్స్యశాఖ, రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్ శాఖ అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి సోమవారం సెంట్రల్ కిచెన్ ద్వారా ఏర్పాటు చేసిన భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, ఎస్‌పి రఘునాయిగం, సిఐ షణ్ముగం, ఎస్ఐ కట్టా సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



బృందంతో మాట్లాడుతున్న ఆర్ఎఒ

మరిన్ని ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు

ప్రజాశక్తి - యానాం

మిచౌంగ్ తుపాను యానాంపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నా అంచనాతో ప్రస్తుతం ఉన్న 20 మందితోపాటు మరో 20 మందితో కూడిన ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం యానాంకు చేరింది. ఆర్ఎఒ మునిస్వామి ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలతో భేటీ అయ్యారు. సావిత్రి నగర్, గిరియంపేట, దరియాలతిప్ప, ఫరంపేట, కురసంపేట, తదితర గ్రామాల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలతో కలిసి ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఎఒ మునిస్వామి పర్యటించారు.